# నవతరం

నేటితరం కోసం...

హైదరాబాద్ | శనివారం, డిసెంబరు 27, 2025 | సంపుటి:11 | సంచిక : 248 | పేజీలు: 4 | వెల : రూ.5


## ఏపీలో ఘోర రోడ్డు ప్రమాదం .. ముగ్గురు మృతి

ఏలూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. భీమడోలు మండలం సూరప్పగూడెం ఫ్లైఓవర్ వద్ద జరిగిన ఈ ప్రమాదంలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. బైక్‌పై ప్రయాణిస్తున్న సమయంలో అతివేగం లేదా ఇతర కారణాల వల్ల వాహనం అదుపుతప్పి ఫ్లైఓవర్ వద్ద ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ముగ్గురు తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారు. మృతులు ద్వారకా తిరుమల ప్రాంతానికి చెందినవారిగా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.

## సిక్కుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

- వారి ప్రాణత్యాగం దేశ ధైర్యసాహసాలు, వీరత్వం, శౌర్యానికి ప్రతీక
- 2035 నాటికి వలసవాద మనస్తత్వం పూర్తిగా వదిలించుకోవాలి
- 'వికసిత్ భారత్' లక్ష్య సాధన బాధ్యత యువతపై ఉంది

'వీర్ బాల్ దివస్'లో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు



2లో

## బాల పురస్కారం అందుకున్న క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ

- 14 ఏళ్ల క్రికెటర్ వైభవ్ సూర్యవంశీకి ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్
- ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు ప్రదానం
- అండర్-19 ప్రపంచకప్ కోసం భారత జట్టుతో చేరనున్న వైభవ్

2లో



## నేడు సీడబ్ల్యూసీ సమావేశం

- జీ రామ్ జీ బిల్లుకు వ్యతిరేకంగా నిరసనలపై చర్చించే అవకాశం
- దేశ రాజకీయ పరిస్థితులు, వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై కూడా..

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అత్యున్నత నిర్ణయాత్మక విభాగం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) శనివారం భేటీ కానుంది. కేంద్ర ప్రభుత్వం

### ఒక్క ప్రెస్ మీట్‌కే రేవంత్‌కు చెమటలు...

## మా అయ్య మొనగాడు



- కేసీఆర్ ఒక్క ప్రెస్ మీట్‌కే రేవంత్ రెడ్డికి ముచ్చెమటలు పట్టాయన్న కేటీఆర్
- కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్ గుండె ఆగిపోతుందని ఎద్దేవా
- సంచులు మోసి పేమెంట్ కోటాలో రేవంత్ సీఎం అయ్యారంటూ విమర్శ
- మహిళలకు రూ.2500, తులం బంగారం హామీలు ఏమయ్యాయి? అంటూ నిలదీత
- కొడంగల్‌లో రేవంత్ రెడ్డిని ఓడించి తీరుతామన్న

సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేసీఆర్ నిర్వహించిన ఒక్క ప్రెస్ మీట్‌తోనే రేవంత్ రెడ్డికి ముచ్చెమటలు పట్టాయని, అలాంటిది ఆయన అసెంబ్లీకి వస్తే రేవంత్ గుండె ఆగి చనిపోతాడని సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేత దోసల అనిల్, కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. "మా అయ్య మొగోడు, తెలంగాణ తెచ్చిన మొనగాడు. ఆయన పేరు నేను బరాబర్ చెప్పుకుంటా" అని కేటీఆర్ అన్నారు. తాను గుంటూరులో ఇంటర్ చదివితే రేవంత్ రెడ్డికి

2లో



## ప్రతి జంటా ముగ్గురు పిల్లలను కనాలి

- వృద్ధ ప్రపంచంలో యువ దేశం మనదే: సీఎం
- ప్రపంచవ్యాప్తంగా 5 కోట్ల భారతీయులు
- తలసరి ఆదాయంలో మన వాళ్లే టాప్
- 2047 నాటికి ప్రపంచంలో నం.1 మనమే
- పిల్లలకు పురాణాల గురించి చెప్పాలి
- స్పైడర్‌మ్యాన్ కన్నా హనుమాన్ బలవంతుడు
- భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో సీఎం

2లో

తిరుపతి,: "భారతీయ కుటుంబ వ్యవస్థ అద్భుతమైనది. మన కుటుంబ విలువలు ప్రపంచంలో మరెక్కడా ఉండవు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. శుక్రవారం తిరుపతిలో విజ్ఞాన భారతి సంస్థ నిర్వహిస్తున్న భారతీయ విజ్ఞాన సమ్మేళనాన్ని ఆయన ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి జితేందర్ సింగ్‌తో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం చంద్రబాబు ప్రసంగిస్తూ, మన కుటుంబ వ్యవస్థ అందరికీ భద్రత కల్పించేలా ఉంటుందని కొనియాడారు. మన కుటుంబ విలువల పట్ల గర్విస్తున్నానన్నారు. "దేశంలో ఇప్పుడు జనాభాయే ఆస్తిగా మారింది. వృద్ధుల జనాభా పెరిగిపోయి పలు దేశాలు ఇబ్బందులు పడుతుండగా, భారత్‌లో మాత్రం "మన యువతకు, పిల్లలకు స్పైడర్ మ్యాన్, యువజనం అధికంగా ఉంది. ప్రపంచంలోని వివిధ దేశాల్లో సుమారు ఐదు కోట్ల మంది భారతీయులు ఉన్నారు. ఏ దేశంలోనైనా తలసరి ఆదాయం మనవారికే అధికంగా ఉంటోంది. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో జనాభా

## అభివృద్ధి వదిలేసి బూతులు తిట్టుకుంటున్నారు

- తెలంగాణలో అభివృద్ధిపై చర్చ జరగడం లేదన్న బండి సంజయ్
- అధికార, ప్రతిపక్షాలు బూతుల పురాణం అందుకున్నాయని విమర్శ
- ప్రజలు పాలన కోరుకుంటే గలీజ్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపణ
- ఉద్యోగాలు, పెట్టుబడులే రాష్ట్రావసరమన్న కేంద్ర సహాయ మంత్రి


తెలంగాణలో అభివృద్ధి పూర్తిగా పక్కదారి పట్టిందని, అధికార, ప్రతిపక్ష పార్టీలు కేవలం బూతులు తిట్టుకోవడానికే పరిమితమయ్యాయని కేంద్ర సహాయ మంత్రి



## కేటీఆర్‌పై కాంగ్రెస్ ఫైర్

- సీఎం రేవంత్‌నుద్దేశించి చేసిన వ్యాఖ్యలపై మండిపాటు
- తోలు తీస్తా అని మీ నాన్న అన్నందుకే మా సీఎం మాట్లాడారు
- మీడియాతో వేర్వేరు చోట్ల మల్లు రవి, చామల, ఆది శ్రీనివాస్, సత్యం, బల్మూరి

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యా ఖ్యలపై కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ మండిపడ్డారు. ముఖ్యమంత్రిని చెప్పు తీసుకొని కొట్టాలని అనిపిస్తోందంటూ కేటీఆర్ మాట్లాడడా న్ని వారు తీవ్రంగా తప్పుబట్టారు. ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆది శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్రావులు శుక్రవారం వేర్వేరు చోట్ల విలేక రులతో మాట్లాడుతూ కేటీఆర్‌పై ధ్వజమెత్తారు.



## ఢిల్లీ హైకోర్టులో పవన్ కల్యాణ్‌కు ఊరట

- పవన్ కల్యాణ్ వ్యక్తిగత హక్కులకు ఢిల్లీ హైకోర్టు రక్షణ
- ఆయన పేరు, ఫొటో, వాయిస్‌ను వాణిజ్యపరంగా వాడొద్దని ఆదేశం
- ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి సంస్థలకు కీలక సూచనలు
- ఏఐ, డీప్‌ఫేక్‌ల ద్వారా కంటెంట్ సృష్టిపైనా ఆంక్షలు
- ఫ్యాన్ పేజీలకు మినహాయింపు... స్పష్టమైన డిస్‌క్లెయిమర్ తప్పనిసరి

# కేటీఆర్‌పై కాంగ్రెస్ ఫైర్

అధికారంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి బూతు పురాణాన్ని పరిచయం చేసిందే బీఆర్ఎస్ నేత లని ప్రభుత్వ విప్ ఆది శ్రీని వాస్ వ్యాఖ్యానించారు. తోలు తీస్తానని కేసీఆర్ అనడం వల్లనే రేవంత్‌రెడ్డి స్పందించారని చెప్పా రు. 'అసెంబ్లీ, పార్లమెంట్, కంటోన్మెంట్, జూబ్లీ హిల్స్, సర్పంచ్ ఎన్నికల్లో మీకు ఇప్పటికే బుద్ధి చెప్పారు. మీరు తిట్లు ఆపకపోతే మా వైపు నుంచి కూడా రియాక్షన్ చూడాల్సి వస్తుంది. మాటకు మాట జవాబు ఇస్తాం'అని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడిన మాటలు చూసి యావత్ తెలంగాణ ప్రజలు సిగ్గు పడుతున్నారని మేడిపల్లి సత్యం అన్నారు. అమెరికాలో చదివానని చెప్పుకునే ఆయన సంస్కారం ఇదేనా అని ప్రశ్నించారు. 'ఎన్నికల్లో ప్రజలు చావు దెబ్బ కొట్టారు. అయినా సిగ్గూ, శరం లేకుండా ముఖ్యమంత్రిపై అవాకులుచెవాకులు పేలుతు న్నారు. సీఎం రేవంత్‌పై కేటీఆర్ అన్న మాటలు వెనక్కి తీసుకోకపోతే ఆయన్ను తెలంగాణలో తిరగనీయం'అని సత్యం హెచ్చరించారు.

**ఇంకా సిగ్గురాలేదా: బల్మూరి**

కేటీఆర్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్రావు తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డా రు. తెలంగాణ ప్రజలు చెప్పు లతో కొట్టినా, సిగ్గు లేకుండా కేటీఆర్ ఇంకా మాట్లాడుతున్నాడని వ్యాఖ్యానించారు. 'నీకు, మీ అయ్యకు సిగ్గూశరం ఉంటే తెలంగాణ రాష్ట్రానికి ఏం చేశారో చెప్పాలి. మా సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న పనులు చూసి ఓర్వలేక ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. తెలంగాణ ప్రజలు నిన్ను, నీ అయ్య చెప్పులు అరిగేలా ఇప్పటికే కొట్టారు. మా ముఖ్యమంత్రి పైన ఇంకోసారి మాట్లాడితే సిరిసిల్లలో చెప్పుల దండ వేసి ఊరేగిస్తారు'అని వెంకట్ చెప్పారు.

**పిచ్చి ఆలోచనలు మానుకోవాలి: చామల**

కేటీఆర్ బుద్ధి, జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నా రని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి మె రిట్ కోటాలో రాజకీయాల్లో గెలిచి సీఎం అయితే, కేటీఆర్ మేనేజ్‌మెంట్ కోటా లో రాజకీయాల్లోకి వచ్చాడని ఎద్దేవా చేశారు. ఎవ రిది ఏ కోటానో, ఎవరు ప్రజల పక్షం వహిస్తారో తెలంగాణ ప్రజలకు తెలుసునని చెప్పారు.

**నోటికి పని చెప్పడం ప్రజాస్వామ్యం కాదు: మల్లు రవి**

తాము అనుకున్నట్టే రాజకీ యాలు నడవాలని.. లేదంటే ఇష్టమొచ్చినట్టు మాట్లాడతా మనే రీతిలో బీఆర్ఎస్ నేత లు వ్యవహరిస్తున్నారని నాగ ర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి అన్నారు. రాజకీయా లు హుందాగా నడపాలే కానీ, నోటికి పని చెప్పడం ప్రజాస్వామ్యం కాదని, ఇది రాజకీయా ల్లో మంచి పరిణామం కాదన్నారు. కేసీఆర్, కేటీ ఆర్‌లు పదేపదే సీఎం రేవంత్‌రెడ్డిని తిట్టినా, ఆయ న సహనం వహించారని, అనుచిత వ్యాఖ్యలు చేసినా పట్టించుకోలేదని గుర్తు చేశారు.

# బాల పురస్కారం అందుకున్న క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ

బీహార్‌కు చెందిన 14 ఏళ్ల యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ అరుదైన గౌరవాన్ని అందుకున్నాడు. క్రీడల విభాగంలో అతడు కనబరిచిన అసాధారణ ప్రతిభకు గుర్తింపుగా 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్' వరించింది. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వైభవ్ ఈ పురస్కారాన్ని స్వీకరించాడు. ఈ పురస్కార ప్రదానోత్సవం కారణంగా, వైభవ్ ప్రస్తుతం జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో మణిపూర్‌తో జరిగిన మ్యాచ్‌కు దూరంగా ఉండాల్సి వచ్చింది. అంతకుముందు అరుణాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ 190 పరుగులతో అద్భుత ప్రదర్శన చేసిన సంగతి తెలిసిందే. అవార్డుల కార్యక్రమంలో పాల్గొనేందుకు ఉదయం 7 గంటలకే రాష్ట్రపతి భవన్‌కు హాజరు కావడంతో అతను మ్యాచ్ ఆడలేకపోయాడు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ.. పురస్కారాలు అందుకున్న చిన్నారులను అభినందించారు. "మీ విజయాలు దేశం మొత్తానికి స్ఫూర్తినిస్తాయి. మీ లాంటి ప్రతిభావంతుల వల్లే భారతదేశం ప్రపంచ వేదికపై వెలుగొందుతోంది" అని ఆమె అన్నారు. వైభవ్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన మరో 19 మంది చిన్నారులు కూడా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. కాగా, వైభవ్ ఈ సీజన్‌లో విజయ్ హజారే ట్రోఫీలో ఆడే అవకాశం లేదు. జనవరి 15 నుంచి ప్రారంభం కానున్న అండర్-19 ప్రపంచకప్ కోసం సన్నద్ధమయ్యేందుకు అతడు త్వరలోనే భారత జట్టుతో చేరనున్నట్లు సమాచారం.

## అభివృద్ధి వదిలేసి బూతులు తిట్టుకుంటున్నారు

బండి సంజయ్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి, జవాబుదారీతనం అనేవే లేకుండా పోయాయని, కేవలం వ్యక్తిగత దూషణలు తప్ప మరేమీ లేవని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ ప్రజా సమస్యలను గాలికొదిలేసి, అసభ్య పదజాలంతో పరస్పరం దూషించుకుంటున్నారు. పాలనలో చూపించడానికి ఏమీ లేనప్పుడే నాయకులు ఇలాంటి వ్యక్తిగత విమర్శలకు దిగుతారు. భాష గురించి నీతులు చెప్పే పార్టీలే ఇప్పుడు రాజ్యాంగ వేదికల నుంచి బూతులు మాట్లాడుతున్నాయి" అని అన్నారు. ప్రజలు సుపరిపాలన కోసం ఓటు వేస్తే, 2014 నుంచి రాష్ట్రంలో గలీజ్ రాజకీయాలు తప్ప మరేమీ చూడలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు కావాల్సింది ఉద్యోగాలు, పెట్టుబడులు, రైతులకు మద్దతు, మెరుగైన పట్టణ మౌలిక సదుపాయాలని, కానీ రోజూ అధికార, ప్రతిపక్షాల మధ్య తిట్ల పోటీలు కాదని బండి సంజయ్ హితవు పలికారు.

## ఒక్క ప్రెస్ మీట్‌కే రేవంత్‌కు చెమటలు...

# మా అయ్య మొనగాడు

వచ్చిన నొప్పేంటని ప్రశ్నించారు. "రేవంత్ అల్లుడు కూడా ఆంధ్ర వ్యక్తే కదా? ఆయన చిట్టినాయుడు కాదు, భీమవరం బుల్లోడు" అంటూ వ్యక్తిగత విమర్శలు చేశారు. సంచులు మోసి, జైలుకు వెళ్లి, పేమెంట్ కోటాలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని కేటీఆర్ ఆరోపించారు.ఎన్నికల హామీలను విస్మరించారని విమర్శిస్తూ, రేవంత్ రెడ్డిని "ఎనుముల రేవంత్ కాదు, ఎగవేతల రేవంత్ రెడ్డి" అని అభివర్ణించారు. కల్యాణలక్ష్మికి తులం బంగారం, మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని సోనియా, ప్రియాంక గాంధీలపై ఒట్టువేసి ఇప్పుడు మాట తప్పారని మండిపడ్డారు. హామీల గురించి ప్రశ్నిస్తే "గుడ్లు పీకి గోటీలు ఆడుతా", "లాగుల తొండలు ఇడుస్తా" అంటూ రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న భాష దారుణంగా ఉందని అన్నారు. తాను తిట్టాలనుకుంటే మూడు భాషల్లో పొల్లు పొల్లు తిట్టగలనని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో కొడంగల్‌లో రేవంత్ రెడ్డిని ఓడించే బాధ్యత తమదేనని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేల్చాలని, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలని కేసీఆర్ అడగడంలో తప్పేముందని ప్రశ్నించారు.

# సిక్కుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

న్యూఢిల్లీ: సిక్కుల పదో మత గురువు గురు గోవింద్ సింగ్ వారసులు బాబా జోరావర్ సింగ్, బాబా ఫతే సింగ్ దేశం కోసం మహోన్నత త్యాగం చేశారని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. ఆనాటి మొగల్ పాలకుల క్రూరత్వం, మతోన్మాదం, ఉగ్ర భావజాలానికి వ్యతిరేకంగా వారు చేసిన ప్రాణ త్యాగం భారతదేశ అసమాన ధైర్యసాహసాలు, వీరత్వం, శౌర్యానికి అత్యున్నత ప్రతీక అని ఉద్ఘాటించారు. గురు గోవింద్ సింగ్ వారసుల త్యాగాన్ని స్మరిస్తూ శుక్రవారం నిర్వహించిన 'వీర్ బాల్ దివస్'లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. పీడనకు వ్యతిరేకంగా ఇద్దరు యువరాజులు సాగించిన పోరాటాన్ని దేశం ఎప్పటికీ స్మరించుకుంటుందని అన్నారు. వారు మనకు గర్వకారణమని చెప్పారు. వయసు, ప్రతికూల పరిస్థితులను సైతం లెక్కచేయకుండా పోరాడుతూ దేశం కోసం ప్రాణాలు వదిలారని పేర్కొన్నారు. చిన్న వయసులోనే మొగల్ పాలకులకు ఎదురొడ్డి నిలిచారని తెలిపారు. బాబా జోరావర్ సింగ్, బాబా ఫతే సింగ్‌లను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగితే సాధించలేనిది ఏమీ ఉండదని యువతకు ప్రధానమంత్రి పిలుపునిచ్చారు. నిజాలను అణచివేశారు "సిక్కు యువరాజుల త్యాగాల గురించి దేశంలో ప్రతి ఒక్కరికీ తెలిసి ఉండాలి. దురదృష్టవశాత్తూ ఆ పరిస్థితి కనిపించడం లేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా వలసవాద ఆలోచనావిధానం కొనసాగుతుండడం విచారకరం. వలసవాద మనస్తత్వానికి బ్రిటిష్ రాజకీయ నాయకుడు మెకాలే ఆద్యుడు. ఇప్పటికీ దాన్ని వదిలించుకోలేకపోతున్నాం. దశాబ్దాలపాటు నిజాలను అణచివేశారు. బ్రిటిష్ కాలంనాటి ఆలోచనా విధానం నుంచి విముక్తి పొందాలన్నదే మన అసలైన సంకల్పం. భారతీయుల ధైర్య సాహసాలు, త్యాగాలు ఇకపై అణచివేతకు గురికాకూడదు. వారి గురించి అందరూ తెలుసుకోవాలి. వాస్తవాలను గ్రహించాలి. మెకాలే కుట్రకు 2035 నాటికి 200 ఏళ్లు పూర్తవుతాయి. మరో పదేళ్లలో వలసవాద మనస్తత్వం నుంచి పూర్తిగా విముక్తి చెందాలి. అదే మన లక్ష్యం. అప్పుడు మనం స్వదేశీ సంప్రదాయాలు, సంస్కృతులను గర్వకారణంగా భావిస్తాం. 'స్వయం సమృద్ధి'మార్గంలో ముందుకు పయనిస్తాం" అని మోదీ అన్నారు. జెన్ జెడ్ (1997 నుంచి 2021 మధ్య జన్మించినవారు), జెన్ అల్ఫా(2010 నుంచి 2025 మధ్య జన్మించినవారు) భుజస్కంధాలపై పెద్ద బాధ్యత ఉంది. 'వికసిత్ భారత్'అనే లక్ష్య సాధన దిశగా దేశాన్ని ముందుకు నడిపించాలి. వారి నైపుణ్యాన్ని, విశ్వాసాన్ని అర్థం చేసుకున్నా. వారిపై నాకు సంపూర్ణంగా నమ్మకంగా ఉంది. వలసవాద మనస్తత్వాన్ని వదిలించుకుంటే మన భాషల వైవిధ్యమే మనకు బలంగా మారుతుంది. ఇటీవల ముగిసిన పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో 160 మంది ఎంపీలు వారి మాతృభాషలో ప్రసంగించారు. తమిళం, మరాఠీ, బంగ్లా వంటి భాషల్లో ప్రసంగాలు సాగాయి. వేర్వేరు కీలక రంగాల్లో అద్భుతమైన ప్రతిభా పాటవాలు ప్రదర్శించినవారికి ప్రతిఏటా ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలు అందజేస్తున్నాం, ఈ ఏడాది 20 మందికి ప్రదానం చేశాం"అని ప్రధానమంత్రి మోదీ చెప్పారు.

# ప్రతి జంటా ముగ్గురు పిల్లలను కనాలి


తగ్గుముఖం పడుతోంది. కానీ, భారత్‌లో మాత్రం 14.8 శాతం పెరిగింది." అని చంద్రబాబు తెలిపారు. మానవ వనరుల లోటును పూడ్చుకోవడానికి దేశంలో ప్రతి జంటా ముగ్గురు పిల్లల్ని కనాలన్నారు. బ్యాట్ మ్యాన్‌లకు బదులుగా మన పురాణ పురుషుల గురించి చెప్పాలి. స్పైడర్‌మ్యాన్ కంటే హనుమంతుడు బలవంతుడు. బ్యాట్‌మ్యాన్ కంటే అర్జునుడు గొప్ప యోధుడు. హాలీవుడ్ హీరోల కంటే మన పురాణ పురుషులు గొప్పవారు. ఈ విషయాలు పిల్లలకు చెప్పాల్సిన అవసరం ఉంది. అలాగే కృష్ణుడి మహిమల గురించి, శివుడి మహత్తుల గురించి, రాముడికి మించిన రాజు లేడనే దాని గురించి చెప్పాల్సి ఉంది. హాలీవుడ్ సినిమా అవతార్ కంటే కూడా మహాభారతం, రామాయణం చాలా గొప్పవని చెప్పాలి. అదే సమయంలో బకాసురుడు, కంసరాజు వంటి వారి గురించి కూడా చెప్పాలి. సమాజంలో మంచి చెడుల వ్యత్యాసం తెలియాలంటే ఇవన్నీ చెప్పాలి." "జ్ఞానం, విజ్ఞానం మన దేశానికి కొత్త కావు. ప్రాచీన కాలంలోనే భారతదేశం విజ్ఞానాన్ని సముపార్జించిపరిఢవిల్లింది. 4500 ఏళ్లకు ముందే విలసిల్లిన హరప్పా, మెహంజదారో నాగరికతలు, అప్పట్లోనే మన అర్బన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ పాటవాలను చాటి చెప్పాయి. 2900 ఏళ్ల క్రితమే ఇక్కడ యోగను ఆచరించాం. ఇప్పుడు 150 దేశాలు యోగాను ఆచరిస్తున్నాయి. 2600ఏళ్ల మునుపే ఆయుర్వేదం ద్వారా వైద్యసేవలు అందించాం. నలంద, తక్షశిల వంటి విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేసుకుని ఆధునిక విద్యను అందించాం. సున్నాను కనుగొన్నదీ, చదరంగం క్రీడను ప్రపంచానికి అందించిందీ భారతీయులే. ఖగోళ శాస్త్రంలో ఆర్యభట్ట, గణితంలో భాస్కరాచార్య, వైద్యంలో చరకుడు, ధన్వంతరి, ఆర్థిక శాస్త్రంలో కౌటిల్యుడు వంటి గొప్పవారంతా ఇక్కడి వారే. 2వేల ఏళ్ల వెనక్కి వెళితే ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలుగా పరిగణిస్తున్న అమెరికా, జపాన్, రష్యా, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ వంటివి ఎంతో వెనుకబడి ఉన్నాయి. అప్పట్లోనే మన దేశ జీడీపీ ప్రపంచ జీడీపీలో 40శాతం ఉండేది. నాలెడ్జి ఎకానమీలో భారత్ ఎప్పుడూ సూపర్ పవర్‌గానే ఉండేది. కానీ వలస పాలన, మన ఆర్థిక విధానాల కారణంగా వెనుకబడ్డాం. 1991లో ఆర్థిక సంస్కరణలు మొదలవ్వగానే మనం అందిపుచ్చుకున్నాం." "మాజీ ప్రధాని వాజపేయి తెచ్చిన సంస్కరణలతో దేశాభివృద్ధికి బలమైన పునాదులు పడ్డాయి. ఇప్పుడు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో మనం బలంగా ఉన్నాం. ప్రపంచంలో పేరున్న ఐటీ కంపెనీలకు భారతీయులే సార?థ్యం వహిస్తున్నారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలో నంబర్ వన్ స్థానానికి చేరుకుంటుంది. రాబోయే అనేక శతాబ్దాల పాటు భవిష్యత్తు భారత్‌దే. ఆ దిశగా మోదీ స్థిరమైన ప్రభుత్వంతో పాటు, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ వంటి వ్యక్తులు తగిన వేదిక రూపొందిస్తున్నారు. ఈ సమయంలోనే సమాజంలో పేద, ధనిక మధ్య అంతరాలు తగ్గే విధంగా వ్యవస్థను రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది. భారతీయత గురించి చర్చించుకోవడానికి భారతీయ విజ్ఞాన సమ్మేళనం మంచి వేదిక. సంస్కృతి, సంప్రదాయాలను నిలబెడుతూ దేశాభివృద్ధి కోసం ఆర్ఎస్ఎస్ చీఫ్ కృషి చేస్తున్నారు." అని చంద్రబాబు అన్నారు. క్వాంటం కంప్యూటింగ్, ఏఐ వంటి వాటితో పాటు గ్రీన్ ఎనర్జీ రంగంలో కూడా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. త్వరలోనే ఏపీ నుంచి క్వాంటమ్ కంప్యూటర్ ఆపరేట్ చేయబోతున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు.

## ఢిల్లీ హైకోర్టులో పవన్ కల్యాణకు ఊరట

టాలీవుడ్ పవర్ స్టార్, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన పేరు, చిత్రం, గొంతు, వ్యక్తిగత గుర్తింపులను ఎలాంటి అనుమతి లేకుండా వాణిజ్య ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయకుండా పలు ఆన్‌లైన్ సంస్థలు, ఏఐ ప్లాట్‌ఫారమ్‌లు, వెబ్‌సైట్లపై మధ్యంతర ఉత్తర్వులు (యాడ్-ఇంటరిమ్ ఇంజంక్షన్) జారీ చేసింది. తన వ్యక్తిగత, ప్రచార హక్కులకు (పర్సనాలిటీ అండ్ పబ్లిసిటీ రైట్స్) భంగం కలుగుతోందని ఆరోపిస్తూ పవన్ కల్యాణ్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరాతో కూడిన ఏకసభ్య ధర్మాసనం ఈ ఎక్స్‌పార్టీ ఆదేశాలు ఇచ్చింది. మూడు దశాబ్దాలుగా సినీ, రాజకీయ రంగాల్లో ఉన్న పవన్ కల్యాణ్‌కు గణనీయమైన వాణిజ్య బ్రాండ్ విలువ ఉందని, ఆయన వ్యక్తిగత హక్కులను కాపాడాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. పలు సంస్థలు పవన్ కల్యాణ్ అనుమతి లేకుండా ఆయన ఫొటోలతో టీ-షర్టులు, కప్పులు, పోస్టర్లు వంటివి అమ్ముతున్నాయని, ఏఐ టూల్స్ ద్వారా ఆయన గొంతు, ఫొటోలను వాడుతున్నారని, సోషల్ మీడియాలో ఫేక్ పేజీలు నిర్వహిస్తున్నారని పవన్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల పవన్‌కు పూడ్చలేని నష్టం వాటిల్లుతుందని ధర్మాసనం పేర్కొంది. ఈ నేపథ్యంలో ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, మీషో వంటి ఈ-కామర్స్ వేదికల నుంచి అలాంటి ఉత్పత్తులను తక్షణమే తొలగించాలని ఆదేశించింది. వాటిని అమ్ముతున్న విక్రయదారుల కేవైసీ వివరాలను పిటిషనర్‌కు అందించాలని సూచించింది. పవన్ పేరును దుర్వినియోగం చేస్తున్న వెబ్‌సైట్ లింకులను వారం రోజుల్లోగా తొలగించాలని స్పష్టం చేసింది. అయితే, ఫ్యాన్ పేజీలకు మాత్రం కొన్ని షరతులతో మినహాయింపు ఇచ్చింది. అవి 'ఫ్యాన్ పేజీ' అని స్పష్టమైన డిస్‌క్లెయిమర్ ఇవ్వాలని, లేనిపక్షంలో వాటిని కూడా నిలిపివేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 9వ తేదీకి వాయిదా వేసింది.

# నేడు సీడబ్ల్యూసీ సమావేశం

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (వీబీ జీ రామ్ జీ) పేరుతో తెచ్చిన కొత్త చట్టంతో పాటు దేశ రాజకీయ పరిస్థితులపై చర్చించనుంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగే ఈ భేటీకి అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంకా గాంధీలతో పాటు అన్ని రాష్ట్రాల పీసీసీల అధ్యక్షులు, సీఎల్పీ నేతలు, పార్టీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరు కానున్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన పరాజయం తర్వాత జరుగుతున్న మొదటి సమావేశం కావడంతో అక్కడి వైఫల్యాలపైనా చర్చించే అవకాశాలున్నాయి. వచ్చే ఏడాది జరగనున్న పశ్చిమబెంగాల్, అసోం, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీ వ్యూహాన్ని సమావేశంలో ఖరారు చేసే అవకాశం ఉందని నేతలు చెబుతున్నారు. ఆయా రాష్ట్రాల్లో స్థానిక పార్టీలతో పొత్తుల అంశంపై ఓ నిర్ణయానికి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. పలు రాష్ట్రాలు ఇటీవల వెల్లడైన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలను భేటీలో విశ్లేంచనున్నారు. దీంతో పాటే యూపీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన నరేగా పథాన్ని రద్దు చేసి, దాని స్థానంలో కొత్తగా తెచ్చి జీ రామ్ జీ చట్టాన్ని అమల్లోకి తెచ్చిన నేపథ్యంలో, దీనిపై. దేశవ్యాప్తంగా చేపట్టాల్సిన నిరసన కార్యక్రమాలపై భేటీలో చర్చించనున్నట్లు కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. నిరసనలపై రోడ్‌మ్యాప్‌ను రూపొందించడానికి సభ్యుల నుంచి ప్రతిపాదనలు కోరనున్నట్లు తెలిసింది. కొత్త చట్టంపై కేంద్రప్రభుత్వం నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నేపథ్యంలో సీడబ్ల్యూసీ తీసుకునే కార్యాచరణ కీలకం కానుంది. ఈ భేటీలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర రాజనర్సింహా ఢిల్లీకి చేరుకున్నారు.



## ఉగ్రదాడులను ఎదుర్కొనేందుకు ఏటీఎస్.. యాంటీ టెర్రర్ గ్రిడ్

న్యూఢిల్లీ: దేశంలోని పోలీసు వ్యవస్థ కోసం ఏటీఎస్(అప్లికెంట్ ట్రాకింగ్ సిస్టమ్)ను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. అదేవిధంగా, యాంటీ టెర్రర్ గ్రిడ్‌ను కూడా అందుబాటులోకి తేవడం ద్వారా ఉగ్రదాడులను ప్రతి స్థాయిలోనూ ఉమ్మడిగా వేగంగా, సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలవుతుందని చెప్పారు. 'వ్యవస్థీకృత నేరాలపై 360%-% డిగ్రీల దాడి'అనే కొత్త పథకాన్ని త్వరలో ప్రవేశ పెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. టెర్రర్ పాలసీకి ఇది అత్యంత కీలకంగ మారనుందని ఆయన వివరించారు. దేశ రాజధానిలో శుక్రవారం మొదలైన రెండు రోజుల యాంటీ టెర్రరిజమ్ కాన్ఫరెన్స్%-%2025లో మంత్రి అమిత్ షా ప్రసంగించారు. 'బలవంతంగా డబ్బు వసూలు చేయడమనే ఏకైక లక్ష్యంతో వ్యవస్థీకృత నేరగాళ్ల ముఠాలు ఏర్పడుతాయి. వాటి నేతలు విదేశాలకు పారిపోయి, అక్కడే స్థిరపడిపోయాక.. ఇక్కడుండే నెట్‌వర్క్ ఉగ్ర గ్రూపుల ఆధీనంలోకి వెళ్లిపోతున్నాయి. అటు తర్వాత, ఆ నెట్‌వర్క్ ఉగ్రవాదం వేళ్లూనుకునేందుకు దోహదపడుతోంది'అని అమిత్ షా చెప్పారు. ఈ సందర్భంగా ఆయన ఆర్గనైజ్డ్ క్రైం నెట్‌వర్క్ డేటాబేస్, వెపన్స్ డేటా బేస్ ఫర్ లాస్ట్, లూటెడ్ అండ్ రికవరీ ఆరమ్స్‌కు సంబంధించిన రెండు డేటాబేస్‌లను ఆయన ప్రారంభించారు. జాతీయ దర్యాప్తు విభాగం(ఎన్ఐఏ) రూపొందించిన ఈ డేటాబేస్‌లను దేశవ్యాప్తంగా ఉన్న భద్రతా విభాగాలు ఉపయోగించుకునేందుకు వీలుందన్నారు. వీటితోపాటు ఉగ్రవాదులు, నేరగాళ్లకు సంబంధించిన డేటాబేస్‌లను కూడా రూపొందించాలని సూచించారు.

## 'హెచ్%-%1బీ' కష్టాలపై అమెరికాతో చర్చిస్తాం

న్యూఢిల్లీ: హెచ్%-%1బీ వీసా ఇంటర్వ్యూలు హఠాత్తుగా వాయిదా పడడం, తద్వారా అమెరికా ప్రయాణాలు ఆగిపోవడం పట్ల భారత విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తంచేసింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెలలో జరగాల్సిన ఇంటర్వ్యూలు నాలుగైదు నెలలపాటు వాయిదా పడ్డాయి. వేలాది మంది భారతీయుల ఇబ్బందులకు గురవుతున్నారు. వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను, వారు చేసిన పోస్టులను నిశితంగా పరిశీలించడానికి వీలుగా ఇంటర్వ్యూలను వాయిదా వేస్తూ అమెరికా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత వారం జరగాల్సిన ఇంటర్వ్యూలను వచ్చే ఏడాది మే నెల దాకా వాయిదా వేస్తున్నట్లు దరఖాస్తుదారులకు అమెరికా ఇమ్మిగ్రేషన్ అధికారుల నుంచి ఈ%-%మెయిల్ సందేశాలు రావడం గమనార్హం. దాంతో వారంతా గగ్గోలు పెడుతున్నారు. ఈ పరిణామాలపై భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్ధీర్ జైస్వాల్ శుక్రవారం స్పందించారు. దరఖాస్తుదారుల కష్టాలను అమెరికా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే దిశగా సంప్రదింపులు జరుపుతామని వివరించారు.

# శాశ్వత అభివృద్ధి పనులు వేగవంతం

**మేడారం జాతర అభివృద్ధి పనులను సమీక్షించిన మంత్రి పొంగులేటి, దానసరి అనసూయ, వేం నరేందర్ రెడ్డి**







ములుగు, నవతరం: మేడారం జాతర సమీపిస్తున్న తరుణంలో, తెలంగాణ ప్రభుత్వం శ్రీ సమ్మక్క సారలమ్మ ఆలయంలో శాశ్వత అభివృద్ధి పనులను వేగవంతం చేస్తోంది, అన్ని ప్రాజెక్టులు షెడ్యూల్ ప్రకారం పూర్తయ్యేలా, 200 సంవత్సరాల పాటు నిర్మించబడేలా, గిరిజన సంప్రదాయాలకు అనుగుణంగా ఉండేలా చూసుకుంటుంది. రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి దనసరి సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డితో కలిసి, కీలక ప్రాజెక్టులను సమీక్షించారు. అందులో ఆలయ పునరుద్ధరణ మరియు ఫ్లోరింగ్, ఇసుకరాయి శిల్పాలు, క్యూ లైన్ మరియు గద్దెలు నిర్మాణాలు, రోడ్లు, జంక్షన్లు మరియు బస్ స్టేషన్ మెరుగుదలలు, ఆలయ లైటింగ్, గేట్లు మరియు ల్యాండ్ స్కేపింగ్ కూడా ఉన్నాయి. డిసెంబర్ 31 నాటికి కోర్ పనులను పూర్తి చేయాలని, మిగిలిన అన్ని ప్రాజెక్టులను జనవరి 5 నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు, ఇందులో సెంట్రల్ లైటింగ్, నీటి సౌకర్యాలు, రోడ్డు విస్తరణలు, ల్యాండ్ స్కేపింగ్, తెలంగాణ, భారతదేశం అంతటా లక్షలాది మంది భక్తులకు సౌకర్యాన్ని కల్పించడం జరుగుతుంది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జాతరను ఘనంగా, సజావుగా, సాంస్కృతికంగా ప్రామాణికంగా నిర్వహించి, భక్తులు సమ్మక్క మరియు సారలమ్మ ఆశీస్సులను అనుభవించేలా ప్రభుత్వం నిబద్ధతను నొక్కి చెప్పారు. భవిష్యత్ తరాల కోసం ఆలయ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటానికి, పలరాతి శిల్పాలు మరియు పవిత్ర నిర్మాణాలతో సహా గిరిజన ఆచారాలు, వారసత్వ అంశాలను చేర్చడం ద్వారా తాత్కాలిక ఏర్పాట్ల కంటే శాశ్వత అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రులు నొక్కి చెప్పారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకాన్, ఐటిడిఎ పిఒ చిత్ర మిశ్రా, డిఎఫ్ఓ రాహుల్ కిషన్ జాదవ్, ఆలయ ధర్మకర్తలు, ఆర్కిటెక్ట్‌లు, అదనపు కలెక్టర్లు, ఆర్ అండ్ బి అధికారులు, స్థానిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కబ్జాదారులతో కుమ్మక్కైన రెవిన్యూ ఇన్స్పెక్టర్?

- రాత్రిపూట జెసిబిలతో ప్రభుత్వ భూములను చదును చేస్తున్న వైనం
- అక్రమ నిర్మాణాల కూల్చివేతల్లో అలసత్వం వహిస్తున్న రెవెన్యూ అధికారులు
- కబ్జాదారులకు కొమ్ముకాస్తున్న అవినీతి అక్రమార్కులకు అడ్డు కట్టపడేనా?





కుత్బుల్లాపూర్, నవతరం: గత దశాబ్ద కాలంగా ప్రభుత్వ భూములు మాయం చేస్తున్నా సరైన చర్యలు తీసుకొని ప్రభుత్వ భూములను కాపాడటంలో విఫలమవుతున్నారు కుత్బుల్లాపూర్ రెవెన్యూ అధికారులు. ఇప్పటికే కొన్ని ఎకరాల భూములు కబ్జాదారుల కబంధహస్తాల్లోకి వెళ్లిపోయాయి. స్థానికంగా ఉన్న సామాజిక కార్యకర్తలు ఎన్ని ఫిర్యాదులు చేసినప్పటికీ కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారుల మొద్దు నిద్ర మాత్రం వీడటం లేదు. రాత్రిపూట జెసిబి ల సహాయంతో ప్రభుత్వ భూములు చదును చేస్తూ%శ్రీ% కొందరు అవినీతి రెవెన్యూ అధికారుల అండదండలు చూసుకుని కొన్ని కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు మాయం చేస్తున్నారు ఇక్కడి కేటుగాళ్లు. అయినా కూడా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు కొందరు అవినీతి అధికారులు. ఎప్పుడో ఒకసారి ఫిర్యాదులకు స్పందిస్తూ తూతూ మంత్రంగా కూల్చివేతలు చేస్తూ%శ్రీ% పరోక్షంగా భూ కబ్జాదారులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు ఇక్కడి రెవెన్యూ అధికారులు. అందుకు ప్రత్యక్ష నిదర్శనం దేవేందర్ నగర్ లోని సర్వే నంబర్ 329/1 లోని ప్రభుత్వ భూముల్లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలే. రాత్రిపూట జెసిబి లు పెట్టి%శ్రీ% బండరాలను సైతం పిండి చేస్తూ%శ్రీ% కోర్టులను తప్పుదోవ పట్టిస్తూ%శ్రీ% ప్రభుత్వ భూములు మాయం చేస్తున్నారు ఇక్కడి భూకబ్జాదారులు. ఇకనైనా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వ భూములు అనేవే లేకుండా పోతాయి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు స్థానిక ప్రజలు. ఇదిలాగే కొనసాగితే భవిష్యత్తు తరాలకు తీవ్ర అన్యాయం చేసిన వారవుతారు. దేవేందర్ నగర్ కట్ట మైసమ్మ బస్తీలో వెలసిన అక్రమ నిర్మాణాలను తొలగించి, భూ కబ్జాదారుల పై పీడీ యాక్ట్ నమోదు చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

# స్టార్టప్‌లకు ఐపీవో కిక్కు




న్యూఢిల్లీ, డిసెంబర్ 24 : ఈ ఏడాది భారతీయ స్టార్టప్‌లకు ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)లు కలిసొచ్చాయి. దీంతో చాలాకాలం తర్వాత మళ్లీ 2025లో స్టార్టప్‌లలోకి నిధులు పోటెత్తినట్టైంది. లెన్స్‌కార్ట్, గ్రో, మీషో, ఫిజిక్స్‌వాలా తదితర 18 స్టార్టప్‌లు దేశీయ స్టాక్ ఎక్స్చేంజీల్లో నమోదయ్యాయి మరి. ఈ క్రమంలో రూ.41,000 కోట్లకుపైగా నిధులను ఈక్విటీ మార్కెట్ మదుపరుల నుంచి సమీకరించాయి. 2024లో రూ.29,000 కోట్లే. అయితే ఈ ఏడాది దేశీయ టెక్ స్టార్టప్‌లు 10.5 బిలియన్ డాలర్ల నిధులనే అందుకున్నాయి. గత ఏడాది 12.7 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. 2023లోనూ 11 బిలియన్ డాలర్లుగా ఉన్నాయని మార్కెట్‌ను సమీక్షించిన ట్రాక్సన్ తెలిపింది. అలాగే 100 మిలియన్ డాలర్లకుపైగా ఉండే ఫండింగ్ రౌండ్లు 14కు పడిపోయాయి. గత ఏడాది 19 జరిగాయి. ఈ ఏడాది ఇరిషా ఈ మొబలిటీ (1 బిలియన్ డాలర్లు), జెప్టో (450 మిలియన్ డాలర్లు), గ్రీన్‌లైన్ (275 మిలియన్ డాలర్లు) వంటి భారీ డీల్స్ ఉన్నా ఫలితం లేకపోయింది. '2025 బ్లాక్‌బస్టర్ ఐపీవోలకు నెలవైంది. వెంచర్ క్యాపిటల్ (వీసీ), ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) దన్ను కలిగిన కంపెనీలు పబ్లిక్ ఇష్యూకు వచ్చాయి' అని ట్రాక్సన్ సహ వ్యవస్థాపకురాలు నేహా సింగ్ పీటీఐకి తెలిపారు.

## వెండి వెలుగులు.. రూ.2.27 లక్షలకు
## కిలో ధర 2025లో రూ.1.37 లక్షలు పెరిగిన విలువ



న్యూఢిల్లీ, డిసెంబర్ 24: బంగారం, వెండి ధరలు అడ్డూ అదుపులేకుండా దూసుకుపోతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో రోజుకొక గరిష్ఠ స్థాయిని తాకుతున్న అతి విలువైన లోహాల ధరలు బుధవారం ఆకాశమే హద్దుగా దూసుకుపోయాయి. వెండి మరో చారిత్రక గరిష్ఠ స్థాయిని తాకింది. న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో కిలో వెండి ఏకంగా రూ.9,750 ఎగబాకి రూ.2,27,000కి చేరుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ వెండి ధర 72 డాలర్లు పలకడంతో దేశీయ ధరలు పుంజుకుంటున్నాయని ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. మంగళవారం ఈ ధర రూ.2,17,250గా ఉన్నది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ వెండి ఆల్‌టైం హైకి 72 డాలర్లకు చేరుకోవడం వల్లనే దేశీయంగా అధికమవుతున్నదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు వెండి ఏకంగా రూ.1,37,300 లేదా 153 శాతం ఎగబాకింది. గతేడాది డిసెంబర్ 31న రూ.89,700గా ఉన్న కిలో ధర ప్రస్తుతం రూ.2 లక్షలు దాటింది. డాలర్ బలహీనంగా ఉండటం, అమెరికా ఫెడరల్ రిజర్వు వచ్చే సమీక్షలో వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు సన్నగిల్లడం, ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుండటంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో వీటి ధరలు పెరుగుతున్నాయని సౌమిల్ గాంధీ వెల్లడించారు. వెండితో పోలిస్తే బంగారం ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర రూ.50 తగ్గి రూ.1,40,800గా నమోదైంది. అంతకుముందు ఇది రూ.1,40,850గా ఉన్నది. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర తొలిసారిగా 4,500 డాలర్లు పలికింది. గత నాలుగు రోజుల్లో పసిడి 186.46 డాలర్లు లేదా 4.3 శాతం ఎగబాకింది. అలాగే ఈ ఏడాది ఇప్పటి వరకు 1,920.19 డాలర్లు లేదా 73.7 శాతం ఎగబాకినట్టు అయింది.



# అధికారంతో అవినీతి పంజా?

**ప్రభుత్వ బోరు ప్రైవేట్ పరం**
**చర్యలు తీసుకోవాలంటున్న గ్రామ ప్రజలు**

టేక్మాల్, నవతరం: టేక్మాల్ మండలం ధన్నుర శివారులో గల పెద్ద చెరువు అలుగు వద్ద ప్రభుత్వ భూమిలో గత 20 సంవత్సరాలుగా ఉన్న బోరు గ్రామానికి త్రాగునీటిని అందించేది. ఇప్పుడు కలాలి సుభాష్ గౌడ్ ప్రభుత్వ బోరును కబ్జా చేసి ఏకంగా తన సొంత భూమిలోకి పైపులైన్ ద్వారా దౌర్జన్యంగా తీసుకెళ్లడం జరుగుతుంది. దీనిపై గ్రామ ప్రజలు ప్రశ్నించగా ఇది నా బోరు అంటూ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నాడు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోగలరని ధన్నూర గ్రామ ప్రజలు కోరుతున్నారు.



## ఎమ్మెల్యే కృష్ణారావును కలిసిన రవియాదవ్

కూకట్పల్లి / శేరిలింగంపల్లి, నవతరం: కూకట్‌పల్లి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరాం కృష్ణారావు ను బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మారబోయిన రవి యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన నాయకుడు పోట్లా నరేందర్ యాదవ్ బీఆర్ఎస్ పార్టీలో చేరికపై విస్తృతంగా చర్చించారు. రవి యాదవ్ నాయకత్వంలో జరుగుతున్న పార్టీ బలోపేత కార్యక్రమాలు, ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ, బీఆర్ఎస్ పార్టీ సిద్ధాంతాలపై ఆకర్షితులై పలువురు నాయకులు పార్టీలో చేరుతున్న విషయాలపై చర్చ జరిగింది. రవి యాదవ్ అధ్వర్యంలో ముందుకు సాగాలని మాధవరం కృష్ణారావుకు సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కీలకంగా స్పందిస్తూ... "శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పార్టీ కోసం పనిచేయాలనుకునే వారు ఎవరైనా ముందుగా మారబోయిన రవి యాదవ్ ను కలిసి మాట్లాడిన తరువాతే కార్యకలాపాలు ప్రారంభించాలి. ఈ విషయంలో ఎలాంటి సందేహం అవసరం లేదు" అని స్పష్టంగా తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి ఐక్యంగా పనిచేయాలని, రాబోయే రోజుల్లో మరిన్ని చేరికలు ఉంటాయని స్పష్టమైంది.

## హిందులపై దాడులను అరికట్టాలి

**::: మా సహనాన్ని పరీక్షంచ వద్దు**





మియాపూర్, నవతరం: బంగ్లాదేశ్ లో హిందులపై జరుగుతున్న దాడులను అరికట్టాలనీ కోరారుతు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గల మియాపూర్ డివిజన్ పరిధిలోనీ హెచ్ఎంటి కమ్యూనిటీ హాల్ నుండి వెదిరి టౌన్షిప్, వాణి నగర్ రేణుక ఎల్లమ్మ టెంపుల్ వరకు బిజెపి సీనియర్ నాయకులు, భజరంగ్ దళ్, ఆర్ ఎస్ ఎస్, విహెచ్ పి నాయకులు, కాలని వాసులు, ప్రజలు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మియాపూర్ డివిజన్ బీజేపీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా హిందువులపై దాడులు పెరిగిపోతున్నాయని, మా మంచి తనాన్ని అలుసుగా తీసుకోకూడదని విజ్ఞప్తి చేశారు. హిందువులు తలుచుకుంటే ప్రపంచంలో ఏ శక్తి మమ్మల్ని ఆపలేదని అంతవరకు తెచ్చుకోకూడదని హెచ్చరించారు. బంగ్లాదేశ్ లాంటి క్రూరత్వం లాంటి దేశాలు మరికొన్ని ఉన్నాయని, అవన్నీ తమ పద్ధతులు మార్చుకోవాలని వారికి హెచ్చరికలు జారీచేస్తున్నామని తెలిపారు. ప్రపంచం మొత్తం టెక్నాలజీ వైపు పరుగులు పెడుతుంటే దాని పై దృష్టి పెట్టకుండా అమాయకులైన హిందువులపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.



**ఘనంగా ఛాంపియన్ సినిమా**

## విజయోత్సవ వేడుకలు

కుత్బుల్లాపూర్, నవతరం: హీరో శ్రీకాంత్ తనయుడు హీరో రోషన్ నటించిన ఛాంపియన్ సినిమా డిసెంబర్ 25వ తేదీన విడుదలై ఘన విజయాన్ని సాధించింది. ఈ సినిమా విజయోత్సవం సందర్భంగా శుక్రవారం నాడు చింతల్ లోని షా సినిమా థియేటర్ లో పంబీ వాసు 40 మంది సిబ్బందికి చీరలు, బట్టలు పంపిణీ చేశారు. హీరో శ్రీకాంత్ స్నేహితుడు పంబి వాసు, అతని స్నేహ బృందం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఛాంపియన్ సినిమా హిట్ అయిన సందర్భంగా ఆనందోత్సాహాలతో కేక్ కట్ చేసి ఉద్యోగులకు దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పంబి వాసు మాట్లాడుతూ, తన స్నేహితుని తనయుడు హీరో రోషన్ కు శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులో మరిన్ని సినిమాలు తీసి విజయాల్ని సాధించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడు బంటు ప్రవీణ్, మహేందర్, శ్రీనివాస్, గణేష్ ,సాజిత్, విష్ణు, నవీన్ ,సంతోష్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.



# చమురులో భారత్ తర్వాతే చైనా!

గత దశాబ్ద కాలంలో అంతర్జాతీయ చమురు గిరాకీ వృద్ధిని చైనానే ముందుండి నడిపించింది. వచ్చే దశాబ్దంలో మాత్రం భారత్ ఆ పనిచేస్తుందని మూడీస్ రేటింగ్స్ తన తాజా నివేదికలో పేర్కొంది. ప్రపంచ చమురు వినియోగదారుల్లో చైనా, భారత్ వరుసగా 2, 3 స్థానాల్లో ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఈ రెండు దేశాల్లో గిరాకీ వృద్ధి విషయంలో అంతరాలున్నాయని తెలిపింది. మూడీస్ ఇంకా ఏమంటోందంటే..గిరాకీ వృద్ధి, దిగుమతిపై ఆధారపడడం భారత్‌లో ఎక్కువగా ఉండబోతోంది. చైనాతో పోలిస్తే వచ్చే దశాబ్దంలో భారత్‌లోనే గిరాకీ వృద్ధి వేగంగా ఉండనుంది. చైనా ఆర్థిక వ్యవస్థ మందగమనం బారిన పడడం, అదే సమయంలో విద్యుత్ వాహనాల(ఈవీ) వ్యాప్తి ఆ దేశంలో ఎక్కువ కావడంతో అక్కడ చమురుకు గిరాకీ తగ్గనుంది. చైనాలో వచ్చే 3-5 ఏళ్లలో చమురు వినియోగం గరిష్ఠ స్థాయికి చేరొచ్చు. అదే సమయంలో భారత్‌లో 3-5 శాతం వార్షిక వృద్ధి నమోదు కావొచ్చు.

**ఇరు దేశాల మధ్య తేడా అదే..**

రెండు దేశాలూ చమురు-గ్యాస్‌పై భారీగా ఆధారపడ్డవే అయినా.. చమురు దిగుమతులపై చైనా ఆధారపడడం తగ్గుతుంది. దేశీయంగా ఉత్పత్తి పెరగడం, అనిశ్చితుల మధ్య గిరాకీ తగ్గడం ఇందుకు నేపథ్యం. ముఖ్యంగా చైనా జాతీయ చమురు కంపెనీ(ఎన్‌ఓసీ)లు.. భారత చమురు కంపెనీలతో పోలిస్తే వచ్చే 3-5 ఏళ్లలో ఉత్పత్తి వృద్ధిలో ముందు ఉండనున్నాయి. చైనా ఎన్‌ఓసీలు తవ్వకం, అభివృద్ధిపై భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. ఇక రిఫైనింగ్, పెట్రోరసాయనాల రంగాల్లో చాలా వరకు ప్రాజెక్టులు పూర్తి కావడంతో ఆ రంగంలో పెట్టుబడులు తగ్గనున్నాయి. కానీ భారత్‌లో మాత్రం ఇంకా రిఫైనింగ్, పెట్రోరసాయనాల ప్లాంట్లపై వచ్చే అయిదేళ్ల పాటు భారీగా పెట్టుబడులు పెట్టాల్సి రావొచ్చు. దేశీయ చమురు-గ్యాస్ ఉత్పత్తిపై భారత ఎన్‌ఓసీల ప్రణాళికలు బాగున్నా.. అమలు జరగాల్సి ఉంది. భారత్‌లో కర్బన నియంత్రణ ఇంకా పూర్తి స్థాయిలో జరగలేదు. చైనాతో పోలిస్తే భారత ఎన్‌ఓసీలకు హరిత సాంకేతికతలపై పెట్టుబడుల విషయంలో తక్కువ ఒత్తిడి ఉంది. అదే చైనాలో హరిత విధానాల విషయంలో కఠిన నిబంధనలు ఉన్నాయి.

**డ్రాగన్ దేశంలో గిరాకీ పరిస్థితి ఇలా..**

చైనాలో చమురు గిరాకీ 2030 కల్లా ఏటా 800 మిలియన్ టన్నుల వరకు చేరొచ్చు. ఆర్థిక వృద్ధి మందగమనానికి తోడు ఆ దేశం స్వచ్ఛ ఇంధనం వైపు మళ్లుతుండడంతో చమురు గిరాకీ వృద్ధిపై ప్రభావం పడతనుంది. ఈవీలు, పునరుత్పాదక ఇంధనంపై దృష్టి కారణంగా డీజిల్, పెట్రోలుపై ఆధారపడడం తగ్గవచ్చు. అయితే విమాన ఇంధనం, నాఫ్తా వినియోగం పెరిగే అవకాశం ఉంది. రిఫైనింగ్ సామర్థ్యం సైతం 1 బిలియన్ టన్నులకు చైనా పరిమితం చేసింది.

**మన దేశంలో..**

భారత్ తన రిఫైనింగ్ సామర్థ్యాన్ని 2030 కల్లా ఏటా 309 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేర్చుకోవాలని భావిస్తోంది. ఏప్రిల్ 1, 2024 నాటికి 256.8 మి. మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉంది. ఆర్థిక వృద్ధి రాణిస్తుండడం, పారిశ్రామికీకరణ, మౌలిక రంగంపై భారీ పెట్టుబడులు తదితరాల వల్ల భారత్‌లో రవాణా ఇంధనాల్లో గిరాకీ వృద్ధి పెరగనుంది. ఇక భారత చమురు మార్కెటింగ్ కంపెనీలైన బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్‌లు ఇటీవలి సంవత్సరాల్లో రిఫైనింగ్ సామర్థ్యాల పెంపు కోసం భారీ పెట్టుబడులు పెట్టాయి.

### సహజ వాయువు విషయంలోనూ..

ఇక గ్యాస్ గిరాకీ వృద్ధి విషయంలోనూ చైనాతో పోలిస్తే భారత్‌లోనే కాస్త అధికంగా నమోదు కావొచ్చు. భారత్ తన ఇంధనాల్లో సహజ వాయువు వాటాను ప్రస్తుత 6 శాతం నుంచి 2030 కల్లా 15 శాతానికి చేర్చుకోవాలని భావిస్తోంది. ఎరువులు, పెట్రోరసాయనాల వంటి పారిశ్రామిక రంగాల విస్తరణకు తోడు, పట్టణ-పాక్షిక పట్టణ ప్రాంతాల్లో సహజ వాయువు వినియోగం పెరుగుతుండడంతో 2030 కల్లా ఏటా 4-7 శాతం మేర గిరాకీ వృద్ధి నమోదు కావొచ్చు.

## జపాన్‌ను అధిగమించి..నాలుగో ఆర్థిక శక్తిగా భారత్: నీతి ఆయోగ్ సీఈఓ

ప్రపంచంలో జపాన్‌ను అధిగమించి భారత్ నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం వెల్లడించారు. దేశ స్థూల దేశీయోత్పత్తి 4 ట్రిలియన్ డాలర్లకు చేరుకోవడంతో అమెరికా, చైనా, జర్మనీ తర్వాత స్థానంలో నిలిచిందన్నారు. పదో నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ అస్థిరత, సవాళ్ల నేపథ్యంలో భారత ఆర్థిక వ్యవస్థ స్థిరంగా కొనసాగుతూ ఒక మార్గదర్శిగా నిలుస్తోందని పేర్కొన్నారు. పెట్టుబడులకు గమ్యస్థానంగా దేశం ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తుండటంతో ఈ ఘనత సాధ్యమైందన్నారు. దేశ ఆర్థిక వృద్ధిని తెలియజేసే ఐఎంఎఫ్ అంచనాలను ఉటంకిస్తూ..అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే ప్రపంచ ఆర్థిక ర్యాంకింగ్స్‌లో మనకంటే ముందు ఉన్నాయని అన్నారు. ఇదే విధంగా మనం ముందుకు సాగితే మరో మూడేళ్లలో జర్మనీని దాటుకొని.. మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని పేర్కొన్నారు. ఇందుకోసం మూలధన వ్యయాల పెంపు, సులభతర వ్యాపార నిర్వహణ, వ్యాపార నిర్వహణ ఖర్చులు తగ్గడం, కార్మికులతో తయారీకి ప్రాధాన్యం, ప్రపంచ మార్కెట్‌పై దృష్టి సారించడం వంటి చర్యలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుతం వృద్ధి చెందుతున్న దేశీయ డిజిటల్ మార్కెట్.. రాబోయే దశాబ్ద కాలంలో భారత చాలా కీలకమన్నారు. మరోవైపు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఇదే విషయాన్ని 'ఎక్స్' వేదికగా తెలిపారు. వికసిత్ భారత్ వైపు ఇది అతిపెద్ద అడుగు అని పేర్కొన్నారు. దీన్ని సాకారం చేసిన ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కొన్నేళ్లలోనే భారత్ మూడో ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఇక బడుగు వ్యాపారుల పైనా జీఎస్టీ!

న్యూఢిల్లీ, మే 24: మధ్య స్థాయి నుంచి భారీ స్థాయిలో వ్యాపారం చేసే వారిని లక్ష్యంగా చేసుకుని ఎడాపెడా జీఎస్టీ భారాన్ని విధించిన కేంద్రం ఇప్పుడు బడుగు, బలహీన వర్గాలను కూడా పన్ను పరిధిలోకి తేవాలని తహతహలాడుతున్నది. అనధికారిక ఆర్థిక కార్యకలాపాలను నియంత్రించి వారిని కూడా జీఎస్టీ పరిధిలోకి తెచ్చేందుకు కేంద్రం జాతీయ స్థాయిలో ప్రచారం నిర్వహించనుంది. ఈ మేరకు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) తన ఫీల్డ్ అధికారుల ద్వారా ఆ దిశగా చర్యలు చేపట్టేందుకు కసరత్తులు ప్రారంభించింది. నమోదు కాని సంస్థల ద్వారా పన్ను ఎగవేతలను నిరోధించి నగదు ఆధారిత, లెక్కల్లో చూపని లావాదేవీలపై ఆధారపడటాన్ని తగ్గించాలని ధ్యేయంగా నిర్ణయించుకుంది. ఇదే కనుక అమలైతే ఇక నుంచి బజ్జీల బండి వాళ్లు, బండ్లపై అరటి పండ్లు అమ్ముకునే వారితో పాటు రోడ్డు పక్కన ఉండే మెకానిక్‌లు, సైకిల్ షాపు వాళ్లు, టైర్లకు గాలి కొట్టేవారు.. ఇలా ఒకరేమిటి రోడ్డుపక్కన తోటకూర అమ్ముకునే తాత నుంచి, రేగు పండ్లు అమ్ముకునే మామ్మ వరకు అందరిపై జీఎస్టీని ఎడాపెడా విధించడానికి కేంద్రం చకచకా పావులు కదుపుతున్నది.

# ఎఫ్ఐఐల 5 వేల కోట్ల వెనక్కి

న్యూఢిల్లీ, : దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీ స్థాయిలో నిధులను వెనక్కితీసుకుంటున్నారు. ఇదే క్రమంలో ప్రస్తుత వారంలోనూ రూ.5 వేల కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావడంతో ఈ నెల 19 నుంచి 23 మధ్యకాలంలో ఈక్విటీల నుంచి 4,784.32 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. దీంతో ఎఫ్ఐఐల పెట్టుబడులు రూ.18,620 కోట్ల నుంచి రూ.13,835 కోట్లకు తగ్గాయని నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గత 5 సెషన్లలో విదేశీ పెట్టుబడిదారులు అత్యధికంగా తమ పెట్టుబడులను తరలించుకుపోయారు. తీవ్ర ఊగిసలాటల మధ్య కొనసాగిన సూచీలు గతవారంలో ఒకేరోజు 10 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను వెనక్కితీసుకున్నారు. అయినప్పటికీ ప్రస్తుత సంవత్సరంలో దేశీయ ఈక్విటీ మార్కెట్లోకి ఎఫ్ఐఐలు రూ.98,516 కోట్ల మేర పెట్టుబడులు పెట్టారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్..యూరోపియన్ దేశాలపై ప్రతీకార సుంకాలను 50 శాతం విధిస్తూ తీసుకున్న నిర్ణయం అంతర్జాతీయంగా పెట్టుబడిదారుల్లో ఆందోళన నెలకొన్నది. ఫలితంగా ఈక్విటీల నుంచి తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాల వైపు మళ్లించారు. దేశీయ ఆర్థిక మూలలపై ఎలాంటి ప్రభావం లేదని, కేవలం అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల వల్లనే ఎఫ్ఐఐలు వెనక్కి తీసుకుంటున్నారని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. ఏప్రిల్ నెలలో ఎఫ్ఐఐలు రూ.4,223 కోట్ల పెట్టుబడులు పెట్టగా, మార్చి నెలలో రూ.3,973 కోట్ల విలువైన స్టాక్స్‌ను కొనుగోలు చేశారు. కానీ, జనవరి నెలలో రూ.78 వేల కోట్లు, ఫిబ్రవరి నెలలో రూ.34,574 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.

## రెండేళ్ల తర్వాత పాపిడి గూడెంలో వెలుగులు నింపిన వార్డు మెంబర్లు



నవతరం, అశ్వారావుపేట : కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో గెలుపు చూసిన తర్వాత సర్పంచ్ ఎన్నికలు లేకపోవడంతో ప్రత్యేక అధికారులను నియమించి గ్రామపంచాయతీ పనులను రెండేళ్లుగా చేయించిన వైనం అందరికీ తెలిసిందే. కానీ ఏ పంచాయతీలో ఎలా ంటి అభివృద్ధి లేకపోవడం, గ్రామాలు అభివృద్ధి విషయంలో వెనకబడిపోవడం సరాసరి నిత్య సత్యం. ఈ నేపథ్యంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట మండలం, ఊట్లపల్లి గ్రామపంచాయతీ, పాపిడి గూడెంలో సర్పంచ్ ఓట్లలో మెజారిటీతో గెలిచిన వార్డు మెంబర్లు ఆళ్ల రాంబాబు, లావణ్యలు అభివృద్ధి పనులను వేగవంతం చేశారు. అభివృద్ధిని పరుగులు పెట్టిస్తూ వీధి లైట్లను వెలిగించి ఆ గ్రామానికి రెండేళ్ల తర్వాత వెలుగులు నింపారు. ఆ గ్రామస్తులు రెండేళ్ల తర్వాత వచ్చిన వార్డు మెంబర్ల ఫలితనాన్ని పలువురు ప్రశంసిస్తున్నారు. ఇలాగే ప్రభుత్వ సహకారంతో ఇందిరమ్మ ఇల్లు, సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు పాపిడి గూడెం గ్రామానికి దయచేయాలని వార్డు మెంబర్లు ఇరువురు నేతలను ప్రాధేయపడుతున్నారు. అలాగే ఊట్లపల్లి సర్పంచిని ఈ సందర్భంగా కోరుచున్నారు.

## యాపిల్.. భారత్‌లో ప్లాంట్లు నిర్మించుకోవచ్చు!

### అక్కడ తయారైన ఉత్పత్తులు అమెరికాలో విక్రయించాలంటే సుంకాలు చెల్లించాల్సిందే

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

న్యూయార్క్: యాపిల్ తన ప్లాంట్లను నిర్మించడానికి భారత్‌కు వెళ్లొచ్చని, కానీ ఆ టెక్ కంపెనీ సుంకాలు లేకుండా అమెరికాలో తన ఉత్పత్తులను విక్రయించడానికి వీలుండదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా అణుశక్తిని పెంచడానికి ఓవల్ కార్యాలయంలో బహుళ కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'టిమ్ కుక్ యాపిల్ ప్లాంట్లు నిర్మించడానికి భారతదేశానికి వెళ్తున్నానని నాతో అన్నారు. అక్కడకు వెళ్లడం ఫర్వాలేదు కానీ సుంకాలు లేకుండా ఇక్కడ ఆ ఉత్పత్తులను విక్రయించడం కుదరదని చెప్పాన'ని ట్రంప్ వెల్లడించారు. ఐఫోన్లను అమెరికాలో సుంకాలు లేకుండా విక్రయించుకోవాలంటే ఇక్కడే ఉత్పత్తి చేయాలని నేను ప్రతిపాదించానని తెలిపారు. దీనికి యాపిల్ సుముఖంగా లేకపోతే 25 శాతం సుంకాలు చెల్లించి ఇక్కడ ఉత్పత్తులను విక్రయించుకోవాల్సి ఉంటుందని వివరించారు.

**భారత్‌లో చౌకగానే..:** భారత్‌లో తయారయ్యే ఐఫోన్లపై అమెరికా సుంకాలు విధించినప్పటికీ మన దేశంలో ఐఫోన్ల తయారీ ఖర్చు అమెరికాలో కంటే తక్కువే అవుతుందని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జీటీఆర్ఐ) తన నివేదికలో వెల్లడించింది. భారత్‌లో తక్కువ ఉత్పత్తి వ్యయాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు వంటివి దీనికి దోహదం చేస్తాయని పేర్కొంది.

**జీటీఆర్ఐ నివేదిక ప్రకారం..:** భారత్‌లో ఒక ఐఫోన్ అసెంబ్లింగ్ ఖర్చు సుమారు 30 డాలర్లు కాగా, అమెరికాలో 390 డాలర్లు వెచ్చించాల్సి ఉంటుంది. భారత్‌లో కార్మికుల జీతాలు తక్కువగా ఉండటమే దీనికి కారణం. మన దేశంలో ఒక కార్మికుడికి నెల సంపాదన సగటున 230 డాలర్లు (రూ.19,000). అదే అమెరికాలో కనీస వేతన చట్టాల ప్రకారం ఈ సంపాదన 2,900 డాలర్ల (రూ.2.4 లక్షలు) వరకు ఉంటుంది .

## ఆ ఒక్క రాష్ట్రంలోనే ఐదు లక్షల కార్లు: డేటా..



సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ తయారీదారుల డేటా ప్రకారం.. 2024-25లో భారతదేశంలో ప్యాసింజర్ వాహనాల అమ్మకాలలో 'మహారాష్ట్ర' మొదటి స్థానంలో ఉండగా, ఉత్తరప్రదేశ్ ద్విచక్ర వాహనాల అమ్మకాలలో ముందుంది. డేటా ప్రకారం.. 2024-25లో మహారాష్ట్రలో ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు 5,06,254 యూనిట్లు (11.8 శాతం)గా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్ 4,55,530 యూనిట్లు (10.6 శాతం), గుజరాత్ 3,54,054 యూనిట్లు (8.2 శాతం) అమ్మకాలతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఆ తరువాత నాల్గవ స్థానంలో కర్ణాటక 3,09,464 యూనిట్లతో (7.2 శాతం), హర్యానా 2,94,331 యూనిట్లతో (6.8 శాతం) ఐదవ స్థానంలో ఉన్నాయి. ద్విచక్ర వాహన విభాగంలో.. ఉత్తరప్రదేశ్ 28,43,410 యూనిట్ల అమ్మకాలతో (14.5 శాతం వాటా) అగ్రస్థానంలో ఉంది. మహారాష్ట్ర 20,91,250 యూనిట్లతో (10.7 శాతం), తమిళనాడు 14,81,511 యూనిట్లతో (7.6 శాతం) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. నాలుగు, ఐదు స్థానాల్లో కర్ణాటక (12,94,582 యూనిట్ల), గుజరాత్ (12,90,588 యూనిట్లు) ఉన్నాయి. త్రిచక్ర వాహనాల విభాగంలో.. ఉత్తరప్రదేశ్ అత్యధికంగా 93,865 యూనిట్లు (12.7 శాతం) అమ్మకాలు జరపగా, గుజరాత్ 83,947 యూనిట్లు (11.3 శాతం), మహారాష్ట్ర 83,718 యూనిట్లు (11.3 శాతం) అమ్మకాలు జరిపాయని డేటా తెలిపింది. కర్ణాటక 70,417 యూనిట్లతో (9.5 శాతం) నాల్గవ స్థానంలో, బీహార్ 47,786 యూనిట్లతో (6.4 శాతం) ఐదవ స్థానంలో నిలిచాయి.

Owned and Published by Sirigiri Varadaraju, Printed at: Shesha Sai Enterprises, Plot No. 98/1, CIE, Phase 2, Gandhinagar, Hyderabad - 37, Telangana State, India, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com